# హింస

సాయంత్రం స్కూల్ వదలగానే, ఇంటికి వస్తున్న నారాయణకు, స్కూల్ బయట వేపచెట్టు కింద నిల్చుని తనవేపే చూస్తున్న వెంకటేశ్వర్లు కనిపించాడు. కాస్త దూరంగానే వెంకటేశ్వర్లును గుర్తించిన నారాయణకు పెదాలపై చిరునవ్వూ, కళ్ళలోకాంతీ, ఒక్క వెలుగు వెలగగా, వేగంగా అడుగులు వేస్తూ దగ్గరకు వచ్చి, "ఏమిట్రా ఇలా ఊడిపడ్డావ్" అంటూ అప్యాయంగా భుజం మీద చేయి వేశాడు.

వెంకటేశ్వర్లు మహా ఆనందంతో తన చేయి కూడా నారాయణ భుజం మీద వేసి, "పది నిమిషాల క్రితమే బస్సు దిగి నేరుగా యిక్కడికి వచ్చి నీకోసం ఎదురు చూస్తున్నానోయ్" అన్నాడు.

"ఇంతకీ ఎక్కణ్నుంచీ రావటం?" ఉత్సాహంగా అడిగాడు నారాయణ.

"మన వూరునుంచే! వారంక్రితం వూరెళ్ళాను. నువ్విక్కడ పని చేస్తున్నావని చెప్పారు. దారిలోనేగదా, పలకరించి ఒక రాత్రి నీతో గడిపి వెళదామని వచ్చేశాను" అన్నాడు వెంకటేశ్వర్లు.

"చాలా ఆనందంగా ఉందిరా. చాలారోజుల తర్వాత కలుసుకున్నాం. పదపద ....ఇంటికి వెళ్ళి మాటాడుకుందాం..." అంటూ వెంకటేశ్వర్లు చేతిలోని సంచీ తన చేతుల్లోకి లాక్కుని ముందుకు నడిచాడు నారాయణ.

నారాయణదీ, వెంకటేశ్వర్లుదీ ఒకే వూరు. స్కూల్ ఫైనల్ వరకూ ఇద్దరూ వాళ్ళవూరికి దగ్గరలో ఉన్న "టౌన్"లో కలసి చదువుకున్నారు. స్కూల్ ఫైనల్ తర్వాత నారాయణ చదువు ఆర్థిక యిబ్బందులవల్ల ఆగి పోయింది. ఆ తరువాత నాలుగేళ్ళకు నారాయణ "సెకండరీగ్రేడ్ ట్రెయినింగ్" పూర్తి చేసి టీచర్‌గా

స్థిరపడ్డాడు. వెంకటేశ్వర్లు బి.ఎస్.సి. అగ్రికల్చర్ చదివి డెమాన్‌స్ట్రేటరయ్యాడు. చదువుకునే రోజుల్నుండీ వాళ్ళిద్దరిదీ విడదీయరాని స్నేహం! చదువు తరువాత కూడా వాళ్ళు అడపా దడపా కలుసుకున్నప్పుడల్లా చాలా యిష్టంగా ప్రేమగా ఉండేవాళ్ళు. వెంకటేశ్వర్లు కేవలం స్నేహితుడే కాకుండా, కాస్త దూరపు బంధువు కూడా! వెంకటేశ్వర్లు చాలాకాలం దూరపు ప్రాంతంలో పని చేస్తూ ఈ మధ్యనే సొంత జిల్లాకు బదిలీ అయ్యాడు. వాళ్ళిద్దరూ కలుసుకోక దాదాపు అయిదారేళ్ళు కావస్తోంది.

ఇంటికి రాగానే నారాయణ భార్య సావిత్రి వెంకటేశ్వర్లును క్షేమసమాచారాలడిగింది. ఆయన భార్యనూ పిల్లల్నీ అడిగింది. వెంకటేశ్వర్లు సంచీలోంచి బిస్కెట్లూ, పళ్ళూ తీసి ప్రేమగా పిల్లలకిచ్చాడు. నారాయణ పిల్లలకు వెంకటేశ్వర్లు ఎవరో గుర్తులు చెప్పి "బాబాయ్" అని పిలువమన్నాడు.

ఇద్దరూ బట్టలు మార్చుకుని మొహాలు కడుక్కుని సావిత్రి ఇచ్చిన కాఫీలు తాగి, ఒకరు మంచంమీదా, మరొకరు ఈజీ ఛేర్లోనూ వాలిపోయి కబుర్లలో మునిగిపోయారు.

తమ ఉద్యోగాల గురించీ, బదిలీల గురించీ, ఇళ్ళ బాడుగుల గురించీ అరగంట మాట్లాడుకున్నారు. తమ పిల్లల్ని గురించీ చదువుల గురించీ, అరగంట మాటాడుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల గురించీ, తెలుగు దేశం పార్టీ గురించీ ఇంకో గంట మాటాడుకున్నారు. తమ పాతమిత్రుల్ని గుర్తు తెచ్చుకుని వాళ్ళ గురించికూడా మాటాడుకున్నారు.

ఇంతలో సావిత్రి వంట ముగించింది.

తాను 'ఆమ్లెట్లు' వేయటంలో స్పెషలిస్టునని చెప్పి, పొయ్యిముందు కూచుని నారాయణ నాలుగు ఆమ్లెట్లు వేశాడు. "ఇప్పుడు ఆమ్లెట్లతో సరి పెట్టుకోవోయ్! పొద్దున్నే కోడి కోయిస్తాను" అన్నాడు. ఏడున్నర దాటుతూండగా భోజనాలకు కూచున్నారు. పిల్లలూ, సావిత్రీ కూడా కూచున్నారు. పిల్లల్ని ఆమాటా ఈమాటా అడుగుతూ వెంకటేశ్వర్లు భోజనం ముగించాడు.

అందరి భోజనాల తర్వాత ఇంటి వెనక పెరట్లో మంచాలు వేసి పరుపులు పరిచాడు నారాయణ. సావిత్రికి చలి ఎక్కువ. ఎంతో వేసవికాలం అయితే కాని పెరట్లో పడుకోదు. ఒక పిల్లాడు తండ్రి పక్కలో దూరాడు.

పెరట్లో మంచాల మీద పడుకుని మళ్ళీ కబుర్లలో మునిగిపోయారు మిత్రులిద్దరూ – చాలా కాలం తరువాత కలుసుకోవటం వల్ల కబుర్లకేం కొరత లేదు కాబట్టి, చాలా ఉత్సాహంగా మాటల్లో పడ్డారు.

రాత్రి పది గంటలు దాటింది.

పెరట్లో మసక వెన్నెల వాళ్ళిద్దరీ ముఖాలమీద పలచగా పడుతోంది.

వెంకటేశ్వర్లు ఏదో ప్రారంభించబోతున్నట్టు, గొంతు సరి చేసుకుని కాసిన్ని మంచినీళ్ళు, తాగి, "నీ మీద ఒక పెద్ద కంప్లయింట్" అని సగంలో ఆగాడు.

"కంప్లయింట్" అనగానే నారాయణ ముఖంలో తటాలున మార్పు వచ్చింది. వెంటనే "నువ్వు చేసే కంప్లయింట్ ఏదో నాకు తెలుసు" అన్నాడు.

వెంకటేశ్వర్లు కొంచెం తడబడ్డాడు. "ఏం తెలుసు?" అన్నాడు.

"తెలుసులే....నువ్వు మన వూరినుంచి వచ్చానని చెప్పగానే, నీనోటి నుంచి ఇలాంటి దేదో వస్తుందని నేను వూహించక పోలేదు."

వెంకటేశ్వర్లు ఆశ్చర్యపోయాడు. "తెలుసన్నావుగా – చెప్పు అదేమిటో –" అన్నాడు.

"నీ నోటి గుండానే వినాలనుంది. కానివ్వు – నా మీద కంప్లయింట్ చేసే వాళ్ళలో నువ్వు నూట ఒకటో వాడివో, రెండో వాడివో అవుతావు."

"అయితే చాలా పాత కథే నన్నమాట! మొన్న మీ ఇంటికి వెళ్ళాను. మీ అమ్మా మీ పెద్ద తమ్ముడూ, నీ గురించి చాలా విషయాలు చెప్పారు." అంటూ ఆగాడు వెంకటేశ్వర్లు.

"ఏం చెప్పారో నేను చెప్పనా! నేను బొత్తిగా వాళ్ళ అతీ గతీ పట్టించుకోననీ, ఏమాత్రం డబ్బు ఇంటికి పంపననీ, మరీ స్వార్ధపరుడై పోయాననీ, ఇన్నేళ్ళుగా ఉద్యోగం చేస్తున్నా పది రూపాయలు కూడా ఇవ్వలేదనీ, నా పెళ్ళాం రాక్షసి అనీ, అత్తనీ, ఆడ బిడ్డల్నీ సరిగా చూడదనీ...ఇవేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా...?" అన్నాడు నారాయణ. ఈ మాటలంటున్నప్పుడు నారాయణ కంఠంలో బాధా, ఆవేశమూ, ధ్వనించాయి.

వెంకటేశ్వర్లు విస్తుపోయాడు. "అవున్రా! సరిగా యిలాగే అన్నారు. ఇంకా చాలా విషయాలు చెప్పుకొచ్చారు. కాని సారాంశం మాత్రం యింతే! నేను నమ్మలేకపోయాను, నువ్వు ఇలా ప్రవర్తిస్తావని. సాహిత్యం చదువుకున్నవాడివి, మంచీ చెడ్డా, తెలిసినవాడివి, నువ్విలా చేసుంటావని నేను నమ్మలేదు గానీ, ఏమో కొంచెం అశ్రద్ధ చేశావేమో అనుకున్నాను. చెప్పొద్దూ? చాలా చెప్పారు వాళ్ళు! ఎప్పుడు ఏది అడిగినా కసురుకుంటావట! ఇన్నేళ్ళుగా ఏ నాలుగయిదు వందలు మాత్రం ఇంటికి సాయం చేశావనీ, నీ పెళ్ళాం పిల్లలు తప్ప మరేదీ నీకు పట్టదనీ, చాలా చాలా చెప్పారు. మీ ఇంటి మనుషులే కాదు. వూళ్ళో మీ బంధువులు కూడా నిన్ను గురించి ఒకటే చెప్పటం – నాకూ ఆశ్చర్యంగానే వుంది." ఇది నిజంగానే కాదంటావా అన్నట్లు చూస్తున్నాడు వెంకటేశ్వర్లు.

☆ ☆ ☆

నారాయణకు పెళ్ళీ, ఉద్యోగమూ, కష్టాలూ, ఇంచుమించు ఒకేసారి ప్రారంభమయ్యాయి. అంటే అంతకు మునుపు నారాయణ ఏ కష్టాలూ పడలేదని కాదు. వీటితో పోలిస్తే అసలు అవి కష్టాలేకావు. వాటికి మరేదయినా పేరు పెట్టాల్సిందే! నారాయణ చదువంతా కష్టాలతోనే గడిచింది. నారాయణ "స్కూల్ ఫైనల్" పూర్తి చేసేసరికి, వాళ్ళ కుటుంబం ఆర్థికంగా బాగా చితికి పోయింది. అంతవరకూ బాగా ఉన్న సంసారమే అయినా, కోర్టు వ్యవహారాలలోపడి, ఆ సంసారం అప్పుల్లో మునిగిపోవటంతో, కాలేజీ చదివించే స్తోమత లేక పోయింది, వాళ్ళ నాన్నకు. ఉండటానికేమో అయిదెకరాల తోటా, పాతికెకరాల మెట్టా ఉన్నా, ఆ వచ్చే పంట కుటుంబ ఖర్చులకు పోనూ, అంతో యింతో మిగిలితే చేసిన అప్పులకు

వడ్డీ చెల్లించటానికే సరిపోయేది. ఇంట్లో జనం కూడా తక్కువమందేం కాదు. నలుగురు మగపిల్లలూ, ఇద్దరాడపిల్లలూ. ఇంత మందీ ఆ ఒక్క వ్యవసాయంలో బతికేవాళ్ళే. ఆ పాడు కోర్టు వ్యవహారాలంటూ లేకపోతే! ఇలాంటి పరిస్థితుల్లో నారాయణ తెగించి, ఒక మిత్రుని దగ్గర స్వయంగా అప్పుచేసి, సెకండరీ గ్రేడ్ ట్రయినింగ్ పూర్తి చేశాడు. అదీ – స్కూల్ ఫైనల్ పాసయినాక, నాలుగేళ్ళు వూరికే వూళ్ళో ఉన్న తరువాత! తను వ్యవసాయం చేయటానికి పనికిరాడని బాగా నిశ్చయించుకున్న తరువాత!

ట్రయినింగ్ పూర్తి అయిన రెండు నెలలకే నారాయణకు పెళ్ళీ, పెళ్ళయిన రెండు నెలలకే ఉద్యోగం రావటమూ వెంట వెంటనే జరిగిపోయాయి. ఈ పెళ్ళి వల్ల వాళ్ళ కుటుంబానికి కలసి వచ్చిందేమీ లేదు కూడా! నారాయణకు తాను చదివిన సాహిత్యం వల్ల అంతో యింతో అభ్యుదయ దృక్పథం ఏర్పడటం చేత, కట్నం తీసుకొని పెళ్ళి చేసుకోటానికి అతని మనసు ఎదురు తిరిగింది. అందువల్ల బంధువుల్లో తనకు నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవటంతో, అతని పెళ్ళి మీద అంతో యింతో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు ఆశాభంగమైంది.

పెళ్ళయేనాటికి తన చదువు కోసం చేసిన అప్పు వెయ్యి రూపాయలున్నా నారాయణ బాధ పడలేదు. భయపడలేదు కూడా! ఆ వెయ్యీ యిచ్చిన మిత్రుడు, వడ్డీ లాంటిది ఆశించకపోయినా, అతడు మరెవరికో ఇవ్వాల్సిన వేయిరూపాయల అప్పును, తన నెత్తిమీద వేసుకుని, దాన్ని వడ్డీతో సహా తీరుస్తానని చెప్పాడు నారాయణ. అది తన నైతిక బాధ్యతగా! ఉద్యోగంలో చేరే ముందే నారాయణ. తన పెద్ద చెల్లెలికి పెళ్ళి నిశ్చయమయితే, తనకు తెలిసిన బట్టల కొట్టులో, ఆరేడు వందల రూపాయల బట్టలు అప్పు తెచ్చాడు. ఉద్యోగంలో చేరిన తరువాత తీర్చవచ్చుననే ధీమాతో! దానికి తోడు ఉద్యోగంలో చేరే ముందు ఖర్చులకోసం మరో రెండు వందలు అప్పు చేశాడు. ఏతావాతా ఉద్యోగంలో చేరే నాటికే రెండు వేల అప్పు అతని మీద ఉంది. ఆ అప్పు తన స్వంత అప్పుగానే భావించుకున్నాడు నారాయణ.

నారాయణకు చిన్నప్పట్నుండీ, కుటుంబ విషయాల మీద ఎక్కువ శ్రద్ధ ఉండేది. తను సంపాదించి తల్లిదండ్రుల్ని ఆదుకోవాలనీ, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయాలనీ, తమ్ముళ్ళను ఆదుకోవాలనీ, ఇంకా ఎన్నో! తన వాళ్ళందరినీ వృద్ధిలోకి తీసుకు రావాలనుకునే వాడు.

ఉద్యోగంలో చేరేటప్పటికి అతని ప్రారంభ జీతం దాదాపు రెండు వందలు. ఒక పల్లెటూరి హైస్కూల్‌లో అతని ఉద్యోగ జీవితం ప్రారంభ మయింది. ఉద్యోగంలో చేరిన రెండు వారాలు దాటకముందే, సంసారం పెట్టాడు. ఇరవై రూపాయలతో రెండుగదుల ఇల్లు అద్దెకు తీసుకుని–

సంసారం పెట్టిన వారం రోజులకే వాళ్ళ నాన్న వచ్చాడు నారాయణ దగ్గరికి. అప్పటికింకా నారాయణ తొలి జీతం కూడా అందుకోలేదు. చేసిన రెండువందల అప్పుతో, సంసారానికి కావాల్సిన సరంజామా ఏర్పాటు చేసుకున్నాడు. సావిత్రి పుట్టింటి వాళ్ళు తమకు పండిన ఇన్ని బియ్యమూ, బేడలూ లాంటివి తెచ్చి

పోశారు. తండ్రి వచ్చేటప్పటికి నారాయణ చేతుల్లో పట్టుమని పదిరూపాయలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో, "అమ్మాయికి బట్టలు పెట్టి పంపాలిరా! ఒక నూరు రూపాయలుంటే సర్దుకో" అని తండ్రి అడిగేసరికి, నారాయణ తన దగ్గర డబ్బు లేనందుకు చాలా దిగులు పడ్డాడు. చిన్నప్పట్నుంచీ నారాయణకు నాన్న అంటే చాలా యిష్టం. చాలా మురిపెంగా పెంచాడు తనని. ఎన్నడూ పల్లెత్తుమాట అనకుండా తన అవసరాలు తీర్చాడు. తను ఉద్యోగంలో చేరేసరికి కొండంత ఆశతో వచ్చాడు. తండ్రి అడగగానే యివ్వటానికి తన దగ్గర డబ్బు లేకపోయిందే అని చాలా విచారం వేసింది నారాయణకు. తను పని చేసే స్కూల్లో "మ్యూచువల్ బెనిఫిట్ ఫండ్"లో వెంటనే ఒక వంద అప్పు తీసుకుని తండ్రి చేతికిచ్చాడు. ఇంట్లో ఉన్న వాటిలోనే కొంత చక్కెరా, గోధుమలూ, మూట కట్టిచ్చింది సావిత్రి. దుబారా ఖర్చులు పెట్టద్దనీ, పొదుపుగా సంసారం నడుపుకోమని సలహా యిచ్చి అవి తీసుకుని వెళ్ళిపోయాడు తండ్రి. తండ్రికి డబ్బు యివ్వగలిగినందుకు నారాయణ చాలా సంతోషించాడు.

తరువాత వారం రోజులకు రెండొందల రూపాయలు జీతం చేతికొస్తే అప్పు చేసిన ఫండ్‌లో వంద తీర్చేసాడు. పూర్తీ కొత్త సంసారం. ఇంకా అతుకు బొతుకులగానే ఉంది. మిగిలిన డబ్బుతో సర్దుకుపోదాంలే అనుకున్నారు భార్యాభర్తలిద్దరూ. అయినా మళ్ళీ నెల జీతం సమయానికి కొన్ని చేబదుళ్ళు చేయకా తప్పలేదు.

రెండో నెల జీతం తీసుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో సిద్ధంగా ఉన్నాడు పెద్ద తమ్ముడు.

వూళ్ళో వ్యవసాయం పనులన్నీ అతనే చూస్తాడు. ఆమాటా, ఈమాటా మాట్లాడిన తరువాత తను వచ్చిన విషయం చెప్పాడు తమ్ముడు. కొత్త బండి (ఎద్దుల బండి) చేయిస్తున్నారట. అర్జంటుగా రెండు వందలు కావాలన్నాడు. నారాయణకు కొంచెం ఆశ్చర్యం వేసింది. తన ఉద్యోగమెంత? జీతమెంత? ఇంటి ఖర్చులకు పోనూ తన దగ్గర మిగిలేదెంత? తనకున్న అప్పు లెన్ని? ఇవన్నీ వాళ్ళకు తెలియనివా? అనుకున్నాడు కానీ, మళ్ళీ వెంటనే సర్దుకున్నాడు. ఇంటి దగ్గర పరిస్థితి తనకు తెలియంది కాదు. అక్కడ ప్రతి దానికీ అక్కరలే. తనని కాకపోతే ఇంకెవర్నీ అడుగుతారు? "బండి ఎందుకిప్పుడు?" అన్నాడు. ఇప్పుడున్న బండి పాతదై ఎన్ని యిబ్బందులున్నాయో ఏకరువు పెడుతున్నాడు తమ్ముడు. కొత్త బండి చాలా అవసరమట. రెండు వందలు ఎక్కడో తీసుకున్నారట! ఇంకో రెండు వందలు కావాలట! డబ్బు తీసుకొని పొద్దునే ఊరికెళ్ళాలట. ఇలా చెప్పకు పోతున్నాడు. నారాయణ బదులు మాట్లాడకుండా వందా యాభై యిచ్చాడు. ఇవి చాలవే అన్నాడు తమ్ముడు. కొంత అసంతృప్తిగానే వెళ్ళాడు. మరురోజే మళ్ళీ స్కూల్ ఫండ్‌లో వందరూపాయలు అప్పు తీసుకున్నాడు నారాయణ. సంసారం పొదుపుగా చేసుకుందాం అనుకుంటే అప్పు పెరిగి పోతూందే అనుకున్నాడు. ఆ మాటే సావిత్రితో అంటే "పోనీలెండి! అవసరాలొస్తే తప్పుతుందా!" అంది.

అరునెలలు గడిచేసరికి పాత అప్పులు ఏమాత్రం తీర్చకపోగా మరో మూడువందలు కొత్త అప్పు చేసి శుభ్రంగా కూర్చున్నాడు నారాయణ. "ఫండ్" లో రెండొందలూ, ఉద్యోగం చేసే ఊళ్ళోనే బట్టలకొట్టులో మరో వందా,- నగదు పెట్టి ఇంటికి కావాల్సిన సరుకులు కొనటం ఎప్పుడో మానేశాడు. ఒక కిరాణాకొట్టులో సరుకుల ఖాతా తెరిచాడు. చేతిలో ఎప్పుడూ ఒక పదిరూపాయలు కూడా ఉండటం లేదు. జీతం చేతికి వచ్చిన సాయంత్రానికే "ఉఫ్" మని ఎగిరిపోతోంది. తన చెల్లెలి పెళ్ళి కోసం బట్టలు తెచ్చిన షాపునుండి, నెలకో, రెండు నెలలకో ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. ఏ నెలకానెల అంతో యింతో తీరుద్దామనుకోవటం, జీతం వచ్చేసరికి ఎవరో ఒకరు వూరినుండి వచ్చి ఎంతో కొంత తీసుకు పోవటం. గతనెలలో తండ్రి చీటీరాసిచ్చి ఒకమనిషిని పంపించాడు. వచ్చిన మనిషి చేత వందరూపాయలు పంపమని. అప్పుడు మొదటి సారిగా కొంచెం కోపం వచ్చింది నారాయణకు. బొత్తిగా లేవని చెప్పి పంపించాడు. నిజానికప్పుడు అతని దగ్గర పైసా లేదు కూడా!

సంక్రాంతి సెలవులొస్తే సావిత్రితో సహా వూరికెళ్ళాడు నారాయణ. ఇంటి కొచ్చినవాళ్ళను వాళ్ళమ్మ ముభావంగా పలకరించింది. కోడలుతో ఆమాత్రం కూడా మాట్లాడలేదు. కట్నంతేని ఈ కోడలంటే ఆమెకు మొదటినుంచీ సకారణమైన కోపం వుందిమరి! వూళ్ళో తెలిసినవాళ్ళు చాలా మంది 'పెద్ద కొడుకువు నువ్వు. బరువు బాధ్యతలు నీవే! అన్నీ నువ్వే చూసుకోవాలి.' అని అధికారికంగా చెప్పారు. అందరి దగ్గరగా నవ్వి వూరకున్నాడు. "మన వూరికే ఉద్యోగం వేయించుకోకూడదట్రా" అన్నారు కొందరు అదేదో తన చేతుల్లో ఉన్నట్లు. "ఉద్యోగంలో చేరిన అరు నెలల కేమిట్రా ఊరి కొచ్చేది? మీ వాళ్ళందర్నీ మరచి పొయ్యావా? పెళ్ళయిన మూనాళ్ళకే సంసారం పెట్టుకోకపోతే, ఏం కొంప కూలుతుందిరా? నువ్వక్కడ పెళ్ళాంతో కులుకుతూంటే ఇక్కడ సంసారం ఎవర్రా ఈదేది?" అని ఎత్తి పొడిచింది వరసకు అత్త అయిన ఒక ఇల్లాలు. అన్నిటినీ పల్లెటూరి మోటు హాస్యాలుగా తీసుకుని నవ్వుకున్నాడు నారాయణ.

సావిత్రి కట్టుకున్న కొత్త చీరను చూసి, నారాయణ చెల్లెళ్ళూ, తల్లీ, ఆ మాటా ఈ మాటా అడిగి మూతులు మూడు వంకర్లు తిప్పారని సావిత్రి చెపితే "ఛ! వూరుకో" అని కోప్పడ్డాడు. పాపం సావిత్రి జడుస్తూనే చెప్పిందామాట.

పండగ రేపనగా వాళ్ళనాన్న, "జేబులో డబ్బేమయినా ఉందేమిరా" అనడిగాడు. నిజానికి నారాయణ దగ్గర ఇరవై రూపాయలు మాత్రమే ఉన్నాయి. అవి తిరుగు ప్రయాణానికి అవసరమవుతాయి. జేబులో ఉంచుకుని లేదని ఎలా చెప్పటం? ఒక అయిదు రూపాయలుంచుకుని, మిగతా తండ్రి చేతికిచ్చాడు. ఆ కొద్ది మొత్తం చూసి ముఖంలో చాలా అసంతృప్తి కనపరిచాడు తండ్రి.

"పండక్కి పెళ్ళానికి చీరకొన్నావు. తోడబుట్టిన వాళ్ళకు కూడా కొనకూడదా? వాళ్ళకెవరు కొంటారూ?" అంది తల్లి. తల్లి మాటలకు నారాయణ ఏం బదులు చెప్పలేక పోయాడు. తనకేమీ తేలేదని అన్నపట్ల అలుకగానే ఉన్నారు చెల్లెళ్ళిద్దరూ.

"నా చీర పెద్దామెకిచ్చేస్తాను" అంది సావిత్రి. "అక్కర్లేదు. నువ్వే కట్టుకో" అన్నాడు నారాయణ. సావిత్రి మాట్లాడకుండా లోపలికెళ్ళింది. తరువాత ఆ చీర పెద్ద చెల్లెలు కట్టుకుని తిరుగుతూంటే నారాయణకు ఏమనాలో తోచలేదు.

పండుగ వెళ్ళిన మరుసటి రోజు వూళ్ళోనే ఉన్న ఒక మిత్రుని దగ్గర పదిరూపాయలు చేబదులు చేసి భార్యతో ప్రయాణమయ్యాడు. వెళ్ళే ముందు పెద్ద తమ్ముడు "వరి మడికి యూరియా మూట కావాలి. ఎవరితోనైనా ఒక మూటకొని పంపించన్నయ్యా" అన్నాడు. నారాయణ ఏం మాట్లాడకుండా బయలుదేరి వచ్చేశాడు.

నెల తర్వాత జీతంతో పాటు ఏవో అరియర్స్ వంద రూపాయలు అదనంగా వచ్చాయి నారాయణకి. టౌన్ కెళ్ళి చెల్లెలి పెళ్ళికోసం బట్టలు అప్పు తెచ్చిన షాపులో రెండువందలు జమవేసి వచ్చాడు. ఆ రోజే ఆ రాత్రే తమ్ముడు వచ్చి "మడికి యూరియా మూట పంపిస్తావనుకున్నాను. డబ్బన్నా పంపుతావనుకున్నాను ఇలా చేశావేం?" అన్నట్టు మాట్లాడాడు.

"నా దగ్గర డబ్బు లేక పోయిందిరా. నిన్ననే జీతం వస్తే టౌన్ కెళ్ళి బట్టల షాపులో జమ వేసి వచ్చాను" అన్నాడు నారాయణ. "బాగయిందే.. ఇప్పుడెట్లా మరి? ఎక్కడన్నా ఒక నూరు రూపాయలు చూడన్నయ్యా!" అన్నాడు.

"నాకిక్కడ పదేపదే అప్పులు ఎలా పుడతాయిరా?" అన్నాడు నారాయణ. తమ్ముడికి కోపం వచ్చినట్టుంది. మొగమంతా బిగదీసుకుని మారుమాట్లాడకుండా ఉదయమే వెళ్ళిపోయాడు ఛార్జీలకు పదిరూపాయలు ఇప్పించుకుని.

వారం రోజుల తరువాత ఏదోపని మీద టౌన్ కెళితే, వాళ్ళవూరి మనిషి, దగ్గరి బంధువే, ఒకాయన ఎదురై, నారాయణను నిలదీసి, "ఏమిట్రా! ఎరువులకు కావాలని డబ్బుకోసం నీ దగ్గర కొస్తే నీ తమ్ముణ్ణి తిట్టి పంపించినావటనే! నీకిదేమైనా బావుందా? ఏదో ఉద్యోగంలో చేరావు. సంసారానికి సాయపడతావని వాళ్ళు ఆశలన్నీ నీమీద పెట్టుకుంటే ఇలాగట్రా చేసేది?" అని మందలించాడు. ఆ మాటలకు నారాయణ నిలువునా నీరై పోయాడు. తను తమ్ముణ్ణి తిట్టి పంపించాడా? "అయినా అప్పుడే సంసారం ఏమిటోయ్ నీకు? నాలుగేళ్ళ పాటు ఆగితే ఏంపోయింది?" అన్నాడా పెద్దమనిషి. నారాయణకు కోపం వచ్చినా తన వెనకాల సాగుతున్న గూడుపుఠాణి ఏమిటో అర్థమయినట్టనిపించింది. తను పండుగకు వూరెళ్ళినపుడు, రకరకాలుగా బంధువులు వేసిన ప్రశ్నలన్నీ వాళ్ళ సొంత బుద్ధితో వేసినవి కావని ఇప్పుడర్థమయింది. తను ఉద్యోగంలో చేరగానే సంసారం పెట్టుకోవటం ఇంట్లో ఇష్టం లేదా? తనేదో ఇక్కడ దుబారా ఖర్చులు పెట్టి సంసారం సాగిస్తున్నాడని ఇంట్లో వాళ్ళ అభిప్రాయంలా ఉంది. ఈ అభిప్రాయాలు అక్కడక్కడా చెప్పకోటం వల్లనే తెలిసినవాళ్ళు తన్నిలా ప్రశ్నించారని నారాయణకు అర్థమయింది. తనవాళ్ళందరూ తన్ను గురించి ఇలా అనుకుంటున్నారంటే, "ఇంత ఘోరమేమిటి?" అని ఆశ్చర్యంలో మునిగాడు.

మూడునెలల తరువాత వేసవి సెలవులొస్తే భార్యతో పాటు మామగారి ఊరెళ్ళి, అక్కడ ఒక వారం రోజులుండి ఆ తర్వాత ఒంటరిగా తమ వూరెళ్ళాడు నారాయణ.

సంక్రాంతి సెలవులకు వచ్చి వెళ్లిన తరువాత మళ్లీ రావటం ఇప్పుడే. చదువుకునే రోజులనుండీ కూడా చీటికీ మాటికీ ఊరెళ్ళే అలవాటు లేదు నారాయణకు. నిజానికి పదే పదే ఊరికి వచ్చి నారాయణ వెలగబెట్టే రాచకార్యాలేం లేవు అక్కడ. వ్యవసాయం గురించి మొదటినుంచీ తెలియదు నారాయణకు. ఆపనిమీదయినా పదే పదే వచ్చి పోవటానికి! ఏ పనీ లేకుండా వూరికే చూచి పోవటానికి రావటం అన్నది నారాయణ ఆలోచనల్లో అసలు లేదు.

"ఇన్నాళ్ళ కేమిట్రా ఊరికొచ్చేది?" అన్నాడొక బంధువు గుమ్మంలోనే. "ఎన్నాళ్ళూ. మూడు నెలలేగా" అన్నాడు నారాయణ చేతిసంచీ అరుగు మీద పెడుతూ.

"వాణ్ణి నిలదీస్తారెందుకు? ఇంటిమీద వానికి మనసుంటే వస్తాడు. లేకపోతే లేదు." అంది తల్లి గడపలోకి వచ్చి. నారాయణకు దాదాపు కళ్ళ నీళ్ళొచ్చాయి. ఇంటికి వస్తే అదా పలకరింపు? తన విషయం చిన్నప్పట్నుంచీ తెలియదా వీళ్ళకు?

"సావిత్రేదీ" అడిగింది వాళ్ళమ్మ, ఒక నిమిషమాగి.

"రాలేదు."

"ఎందుకొస్తుంది? అత్తకీ, ఆడ బిడ్డలకూ చాకిరీ చేసి అలసిపోయింది. పాపం!" అంటూ తల్లి దొడ్లోకి వెళ్ళిపోయింది.

ఆ రోజంతా ఎవరూ ఇష్టంగా పలకరించలేదు. తను చేసిన నేరమేమిటో అంతుచిక్కలేదు నారాయణకు. ఆ సాయంత్రం దగ్గరున్న వంద రూపాయలు తల్లి చేతికిచ్చాడు. "ఎందుకులే నీ ఖర్చులు నీకూ ఉంటాయి" అంటూనే తీసుకుంది. ఈ వాతావరణమంతా చాలా కొత్త అనిపించింది నారాయణకు. అతని మనసులో కొత్త దిగులు ప్రారంభమయింది. వీళ్ళు తనను పరాయి మనిషిలా చూస్తారేం?

సెలవుల్లో ఉండగానే ఒక నెల జీతం వచ్చింది. అప్పుడే దానికోసం ఖర్చులు తయారు చేసి ఉంచారు. జీతం కాస్తా ఇంట్లో వాళ్ళు తమ హక్కుగా తీసుకున్నారేగాని వానికేమైనా అవసరాలుంటాయేమో అని కూడా ఆలోచించలేదు. అతనికున్న అప్పుల గురించి ఎవరూ పెదవికూడా విప్పలేదు. ఉద్యోగంలో చేరి సంవత్సరం కావస్తున్నా అతని అప్పులన్నీ, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి.

ఆరాత్రి ఎవరో బంధువుతో మాట్లాడుతూ తల్లి, "ఏమో! ఆ జీతం గొడవలు మాకేం తెలుస్తాయి? రెండొందలో మూడొందలో వస్తుందంటారు. ఎప్పుడన్నా పదో పరకో యిస్తాడు. సంసారం పెట్టుకున్నాక వాడికి మాత్రం తీరుతుందా? పెద్దాడు కదా! కాస్తా ఆదుకుంటాడనుకున్నాం – ఆ ఆశా పోయింది" అంటూంటే అప్పటికప్పుడు బయలుదేరి వచ్చేద్దామనుకున్నాడు.

సెలవులు పూర్తయి, వారం తిరక్కముందే, అనుకోని విధంగా "ట్రాన్స్‌ఫర్" వచ్చింది నారాయణకు. బదిలీ ఆర్డరు చేతికొచ్చినప్పటికి, అతని చేతిలో పాతిక రూపాయలు కూడా లేవు. ఆ వూరు విడిచి వెళ్ళాలంటే స్కూల్ ఫండ్‌లో రెండొందలు చెల్లించాలి. కిరాణా కొట్టులో వందా, చేబదుళ్ళు ఓ వందా. కొత్త

వూళ్ళో మళ్లీ జీతం వచ్చేదాకా అయ్యే ఖర్చులూ వీటన్నిటికీ ఐదారు వందలయినా లేనిదే సాగదు. ఇంత డబ్బు ఇప్పుడెవర్నడగాలి? చేసే కొత్త అప్పు మళ్ళీ ఎప్పుడు తీర్చాలి? ఇంట్లో వాళ్ళకు, నెలనెలా తనిచ్చే డబ్బులు కావాలి కాని, తన అప్పులు ఆలోచిస్తారా?

ఎలాగయితేనేం తన స్కూల్లోనే పని చేసే ఒక ఉపాధ్యాయునికి, రెండు రూపాయల వడ్డీతో నోటు రాసియిచ్చి, ఐదువందలు అప్పు పుట్టించుకున్నాడు.

కొత్తవూరు చేరుకుని కుదుటపడేసరికి, చేతిలో మిగిలిన చిల్లర డబ్బులు దానికీ దీనికి ఖర్చయిపోయాయి. మళ్ళీ జీతం చేతికొచ్చేసరికి వాళ్ళ నాన్న రాసిన సుదీర్ఘమైన ఉత్తరం చేతికొచ్చింది, డబ్బు కావాలంటూ! నారాయణ ఆ ఉత్తరానికి బదులేమీ రాయలేదు. బదులు రాకపోయేసరికి పది రోజులకల్లా తమ్ముడు రానే వచ్చాడు. నారాయణ తమ్మునికి పరిస్థితినంతా వివరంగా చెప్పాడు. కనీసం పాతవూళ్ళో చేసిన అప్పయినా తొందరగా తీర్చకపోతే ఎలా? అన్నాడు. "అస్తమానూ డబ్బు తెమ్మంటే ఎక్కణ్ణుంచీ తేను?" అని కొంచెం గట్టిగానే మాట్లాడాడు. తమ్మునికి కోపం వచ్చి అన్నం కూడా తినకుండా బయలుదేరాడు. మళ్ళీ నారాయణకు బాధేసింది. తమ్ముడు అన్నం కూడా తినకుండా వెళుతున్నందుకు. వెంటనే తమ్ముని వెనకాలే వెళ్ళి బస్టాండు నుండి వెనక్కు పిలుచుకు వచ్చాడు. తన దగ్గరున్న చిల్లరంతా తీసి ఒక యాభై రూపాయలిచ్చాడు. భోజనం చేసి వెళ్ళాడు తమ్ముడు.

నెలరోజుల తర్వాత "అమ్మకు ఆరోగ్యం బాగాలేక ఆస్పత్రిలో చేర్పించినామని" వూరినుండీ ఉత్తరం వస్తే, చూసి రావటానికి బయలుదేరాడు నారాయణ. సావిత్రి తానూ వస్తానంది. "ఎందుకులే అనవసరపు ఖర్చులు" అన్నాడు నారాయణ. "మీరలా అనుకుంటారు. కాని ఆస్పత్రిలో చేరిన అత్తను చూడ్డానికి రాలేదని అందరూ నన్నాడిపోసుకుంటారు" అంది సావిత్రి. నారాయణ ఇంకేం మాట్లాడలేదు. ఆ రోజే ఇద్దరూ ఆస్పత్రికి వెళ్ళారు. వీళ్ళు వెళ్ళేసరికి ఆస్పత్రిలో పడక దగ్గర తండ్రీ, చెల్లెలూ ఉన్నారు. డాక్టర్ని జబ్బు వివరాలడిగి తెలుసుకున్నాడు నారాయణ. రెండు వారాలపాటయినా ఆస్పత్రిలో ఉండాలన్నారు. మందులూ అవీ రాసిచ్చాడు. అన్నిట్నీ కొని తెచ్చాడు నారాయణ. రెండు రోజుల పాటు తానూ అక్కడుండి తిరిగి వచ్చేటప్పుడు, సావిత్రిని సేవలు చెయ్యటానికి అక్కడే ఉంచి వచ్చాడు. ఆ తర్వాత ప్రతి రెండు రోజులకూ ఒకసారి వచ్చి చూసి వెళుతున్నాడు నారాయణ. ఖర్చుల కోసం కొత్త అప్పులు పుట్టే అవకాశం లేక, పెళ్ళిలో తనకు పెట్టిన ఉంగరమూ, వాచీ అమ్మేశాడు. రెండు వారాల పాటు ఆస్పత్రిలో వుండే సరికి సావిత్రి బాగా చిక్కిపోయింది. ఎంత సేవలు చేసినా కోడలు కోడలే! ఆస్పత్రి నుంచీ డిశ్చార్జి చేశాక, ఆ వూళ్ళోనే వున్న బంధువుల యింటికి చేర్చారు అమ్మను. నారాయణ వచ్చి తను ఉద్యోగం చేసే ఊరికి రమ్మని అమ్మను పిలిచాడు. అక్కడే కొంతకాలం వుండి మందులూ అవీ వాడొచ్చునన్నాడు. "ఇప్పటికే నీ పెళ్ళాం చేసిన సేవలు చాల్లేరా" అంది అమ్మ వెటకారంగా. ఆ బంధువుల ఇంట్లో ఉన్న ముసలావిడ, "జబ్బు మనిషిని నీ పెళ్ళాం ఎక్కడ చూస్తుందిలేరా" అని

ఎత్తి పొడిచింది. సావిత్రి కూడా బలవంతం చేసింది. "మీ మొగుడూ పెళ్ళాల మధ్య నేనెందుకు లేమ్మా?" అంది. నారాయణకు కోపం వచ్చి, సావిత్రితో తిరిగొచ్చాడు. రెండు వారాలు సేవలు చేసి, చచ్చీ, చెడీ తిరిగి, మూడువందలు ఖర్చులు పోసి, వెటకారాన్నీ, ఎత్తి పొడుపుల్నీ, వెంట తెచ్చుకున్నాడు నారాయణ.

కొన్నాళ్ళ తర్వాత ఒక బంధువుల పెళ్ళికి తప్పని సరిగా వెళ్ళాల్సి వచ్చి వెళ్ళాడు నారాయణ. అక్కడ తెలిసినవాళ్ళు పీకి పోగులు పెట్టారు నారాయణను. "ముసలి తల్లి గదరా! నీ దగ్గరే ఉంచుకోకూడదట్రా" అని ఒకరూ, "ఇంటికేమీ యివ్వవట గదరా" అని మరొకరూ, "మీ నాన్న ఎలా బతికినవాడు, సరిగా చూసుకోరా?" అని ఇంకొకరూ! నారాయణ భరించలేక పెళ్ళి పూర్తి కాకముందే వచ్చేశాడు...

...ఇలా పదేళ్ళు గడిచి పోయాయి.

ఈ పదేళ్ళలో నారాయణకు మూడు బదిలీలు జరిగాయి. రెండు వందల జీతం పెరిగింది. పాత అప్పుకు తోడు కొత్త అప్పు మూడువేలు పెరిగింది. ఇంటికి పదులూ, వందలూ, వేలూ, ఇస్తూనే ఉన్నాడు. తన చెల్లెళ్ళకు బట్టలు పెడుతూనే ఉన్నాడు. తనకేమీ ఇవ్వడనీ, పెట్టడనీ, వాళ్ళు ప్రచారం చేసుకుంటూనే ఉన్నారు. తమ సంగతే పట్టించుకోవడం లేదని చెబుతూనే ఉన్నారు. కనిపించిన ప్రతి బంధువూ, తెలిసినవాడూ, "ఏమిట్రా! చివరకు ఇలా అయిపోయావు" అని దెప్పుతూనే ఉన్నారు.

అందరి బంధువుల దృష్టిలో, పరిచయస్తుల దృష్టిలో నారాయణ ఇప్పుడొక స్వార్థపరుడు. తన పెళ్ళాం పిల్లల బాగు మాత్రమే చూసుకునే రకం – ఏ రెండేళ్ళకో ఒకసారి చుట్టుపుచూపుగా వూరికి వెళ్ళి వచ్చే రకం! ఇప్పుడు ఇంట్లో ఎవరికేనా జబ్బులు చేస్తే ఆ జబ్బుకు కారణం నారాయణ. పదవతరగతి పాసవని తమ్ముడికి ఏ ఉద్యోగమూ రాకపోతే కారణం నారాయణ. పొలంలో పంటలు పండక పోతే కారణం నారాయణ. ఇంట్లో కరెంటు దీపం వెలగకపోతే కారణం నారాయణ. నారాయణ నామ జపంతో ఆ ఇంట్లో తెల్లవారుతుంది. నారాయణ నామ జపం చేస్తూ రాత్రిళ్ళు పడుకుంటారు. అంతా నారాయణమయం...

☆ ☆ ☆

నారాయణ చెప్పేదంతా వెంకటేశ్వర్లు జాగ్రత్తగా విన్నాడు. వింటున్న కొద్దీ అతడికీ కోపం వచ్చేసింది. "వాళ్ళ ఏడుపు వాళ్ళు ఏడుస్తారులే! నువ్వు పట్టించుకోకు! అయినా వాళ్ళకిదేం రోగం? అందరితోనూ ఇలా చెప్పి ఏడిచే బదులు ఆ అనేదేదో నిన్నే ఎదుటపడి అనొచ్చు గదా" అన్నాడు.

"అదీ అయింది! ప్రతిసారీ ఒకేప్రశ్న! నీ జీతమంతా ఏం చేస్తున్నావని?" "మీకిస్తున్నాగా, నా దగ్గరింకేముంటుంది?" అంటే "ఏమిస్తున్నావ్?" అంటారు. "అప్పుడో పదీ యిప్పుడో పదీ యిస్తే అది యిచ్చినట్టేనా" అంటారు. చివరకు నేనిచ్చిన వేల మొత్తాలన్నీ పదుల్లోకి వచ్చేశాయి. నేను పెళ్ళాం పేరుతోనూ, పిల్లల పేరుతోనూ, బ్యాంకుల్లో వేసుకుంటున్నానట. ఇంతకంటే పెద్ద జోక్ ప్రపంచంలో ఉండదు. ఒక సంగతి చెప్పనా? నువ్వు నమ్మవేమో! నేను ట్రయినింగ్

కోసం చేసిన అప్పు ఇప్పటికీ తీర్చలేక పోతున్నాను. ఎప్పుడయినా అరియర్స్ లాంటివి వస్తే వడ్డీలు మాత్రం చెల్లిస్తున్నాను. సంవత్సరం క్రిందట కరెంటింజనుకు కావాలంటే కెనరా బ్యాంక్‌లో వేయి రూపాయలు అప్పు తీసి యిచ్చాను. ఇవి కాక ఇంట్లో ఎవరికి ఆరోగ్యం బాగా లేకపోయినా, నేనే వైద్యాలు చేయిస్తున్నాను. అయినా నన్ను గురించి ఎక్కడా ఒక్క మంచి మాట చెప్పటం లేదు. అందరి దగ్గరా ఒకటే దుష్ప్రచారం! ఈ పదేళ్ళలో నేను బాగా విసిగి పోయాను. వూరికి వెళ్ళాలంటేనే భయం. వాస్తవాలు ఏ కొద్దిమందికి మాత్రమో తెలుసు. ఎందరి దగ్గరని నన్ను నేను "డిఫెండ్" చేసుకోగలను? ఇంక సావిత్రి మీదయితే లేనిపోని అభాండాలు. ఈ మధ్యనే మా చిన్న చెల్లెలు వచ్చి పదిరోజులుండి వెళ్లింది. ఏడువందలు ఖర్చు పెట్టి బట్టలు పెట్టి పంపించాను. వెళ్ళగానే జబ్బు పడిందని కబురొస్తే చూడ్డానికి వెళ్ళాను. "నీ పెళ్ళాం ఏం మందు పెట్టిందో దానికి?" అనేసింది మా అమ్మ. నేను నిలబడలేక పోయాననుకో- ఎంతెంత మోటుమాటలు విసిరేస్తారు – ఇంతకంటే నీచమైన నిందలు ఇక ఉంటాయ్రా – ఎలా భరించటం చెప్పు? ఒకరి ముఖాలు ఒకరు ఇంకెలా చూసుకోటం? పదిమందిలో ఇక సావిత్రిని గురించి ఏమనుకుంటారు? సావిత్రి చాలా శాంతమయింది కాబట్టి సరిపోయింది గాని..." అంటూండగానే నారాయణ కంఠం వణికింది.

"మీ ఇంట్లో నీ గురించి చెప్పినప్పుడు నిజంగా నీమీద కొంచెం దురభిప్రాయం కలిగింది. నారాయణా! ఇప్పుడు నిజమేమిటో తెలుస్తోంది... "కొడుకులవల్ల తల్లిదండ్రులు అనుభవించే కష్టాల కంటే, తల్లిదండ్రుల వల్ల కొడుకులు పడే కష్టాలే ఎక్కువ" అని ఎక్కడో చదివినట్టు గుర్తు. అది నీ విషయంలో నిజమనిపిస్తోంది" అన్నాడు వెంకటేశ్వర్లు.

"పోనీలే నువ్వయినా అర్థం చేసుకున్నావు నన్ను. నాకు చాలాకాలంగా ఒక సందేహం ఉంది. ఈ స్థితి నేనొక్కణ్ణే అనుభవిస్తున్నానా? నాలాంటి వాళ్ళు ఇంకా ఉన్నారా? మీ యింటికి నువ్వు ఒక్కడివే కొడుకువి కాబట్టి నీకు బాధలు లేక పోవచ్చు" అన్నాడు నారాయణ.

"నీ అనుమానంలో నిజం లేకపోలేదు. మా డిపార్ట్‌మెంటులో రాధాక్రిష్ణ అనే ఆయన పని చేస్తున్నాడు. ఆయనా నీలాగే ఇంటికి పెద్ద కొడుకు – ఇద్దరు తమ్ముళ్ళను చదివించాడు. ఒక చెల్లికి పెళ్ళి చేశాడు. తన సర్వస్వాన్నీ కుటుంబానికి ధారపోశాడు. అయినా అతని తమ్ముళ్ళూ, తల్లిదండ్రులూ అతనితో ఎప్పుడూ పోట్లాడినట్లే ఉంటుంది. అతను వూరికి వెళ్ళివచ్చినప్పుడల్లా చాలా దిగులుగా వచ్చేవాడు. నెలనెలా వాళ్ళ నాన్న వచ్చి పీకల మీద కూచునే వాడు. అతనికి ఆఫీసు నిండా అప్పులే! ఒక అప్పు తీరిస్తే మరో అప్పు పెరుగుతూ వుంటుంది. సినిమా హీరోలా బోలెడు త్యాగాలు చేశాడు. నలభై ఏళ్ళకే అరవై ఏళ్ళవానిలాగా బతుకును ఈడుస్తున్నాడు. ఇంత చేసి అతనికీ నిందలే! మా పక్కింట్లోనే ఉండేవాడు. కాబట్టి అడపా దడపా అతని బాధలు మాకు తెలుస్తూనే ఉంటాయి. నువ్వు కూడా మొత్తం మీద మహా బాధ ననుభవిస్తున్నావోయ్ నారాయణా!" అన్నాడు వెంకటేశ్వర్లు జాలిగా.

"ఇది కేవలం బాధ మాత్రమే కాదోయ్! దీనికి నేనో కొత్త పేరు పెట్టాను, 'హింస' అని! ఇది ఎవ్వరికీ కనిపించని హింస! ఎవ్వరూ గుర్తించని హింస, హింస అని చెప్పినా నమ్మరాని హింస. దెబ్బలు లేని హింస, రక్తం కారని హింస, మాటలతో చేసే హింస, మనసులతో చేసే హింస, ఏ హింసకైనా ప్రతి హింస ఉంటుంది. కాని, యిది ప్రతి హింస లేని హింస...ఈ హింసను వర్ణించటానికి యింతకంటే మాటలు లేవు. ఈ హింసను ఇంకా ఎంతమంది అనుభవిస్తున్నారో నాకు తెలియదు" అన్నాడు నారాయణ.

"ఏమిటోయ్ మరీ అంత పిచ్చిగా మాట్లాడుతావ్! నిన్ను వాళ్ళు అంతగా హింస పెడుతున్నపుడు నువ్వు వాళ్ళ ఛాయలకే వెళ్ళకు. సరిపోతుంది. నేనైతే ఇంత చీదర భరించను నీలాగా..." అన్నాడు వెంకటేశ్వర్లు.

"కోపం వచ్చినప్పుడు నేనూ అలాగే అనుకుంటాను. కాని మళ్ళీ వాళ్ళేదయినా కావాలని నా దగ్గరికి రాగానే, "అయ్యో! ఎంత అవసరమో అనుకుంటాను. వాళ్ళు నా నుండి డబ్బు ఆశించడం చాలా సహజమైన విషయం. కాని వాళ్ళు ప్రవర్తించే తీరు మాత్రం సహజమైంది కాదు. "

☆ ☆ ☆

మరునాడు ఇద్దరూ "బస్టాండు" వేపు నడుస్తూంటే, నారాయణా అని ఎవరిదో పిలుపు. చేతిలో గొడుగూ, భుజంపై కండువా... "మీ అమ్మ ఒకటే ఏడుస్తూందోయ్! ఇంటికి పెద్దవాడవై ఉండీ ఇది నీకు తగునట్రా! వాళ్ళు ఉసూరుమంటే నువ్వు సుఖపడగలవా? ఎవరి సంపాదనైతే ఏమిటి? మీరూ మీరూ సర్దుకు పోవాలి గాని" అని మాట్లాడేస్తూన్నాడు.

నారాయణ బేలగా వెంకటేశ్వర్ల వేపు చూశాడు.

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 17-8-1983)*

★ ★ ★